క్లుప్తంగా

ముగిసిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 22వ వార్డు మహానాడు ఒకటో రోడ్డులో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి ముగింపు వేడుకలు శ్రీకృష్ణా ద్వారకా సేవా సమితి, రాయల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉట్టి కొట్టుట, కోలాటం, నృత్యాలు, బొల్లావుల సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పాప రహిత హృదయంతో ప్రార్థించాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్క మానవుడు పాపరహితమైన హృదయంతో దేవుని ప్రార్థించాలని బాలఏసు దేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో ఆదివారం దివ్యపూజా బలి నిర్వహించారు. ఈసందర్భంగా బాల స్వామి వాక్యోపదేశం చేస్తూ తన చుట్టూ ఉన్న వారిని ప్రేమించాలని, దయతో మెలగాలన్నారు.భక్తి పూర్వక విశ్వాసంతో భగవంతుని ప్రార్థించినట్లయితే ఆయన వారి మొరలను ఆలకిస్తాడని చెప్పారు. భగవంతుడి పై విశ్వాసం ఉంచి ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. అనంతరం దివ్యపూజా బలి నిర్వహించారు. ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు.

చిన్నారులకు చెస్ పోటీలు

తెనాలి: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. నాగసాయిదివ్య, కొత్త లక్ష్మి, హర్షిత్, అందె తన్మయ, సాదిక, దీపిక, దినేష్‌రెడ్డి సూర్యనారాయణ, శశాంక్, మౌళి, ప్రభంజన్‌లు విజేతలుగా నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్ మోచర్ల నిరంజన్ పర్యవేక్షించారు.

నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రదానోత్సవం

మంగళగిరి: రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఆదివారం నగరంలోని లిటిల్ విలేజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి ఉపాధ్యక్షుడు, నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రాజెక్ట్ చైర్మన్ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ రోటరీ ఇండియా లిట్రసీ మిషన్ నిబంధనల ప్రకారం శాస్త్రీయ విధానంలో సర్వే చేసి అవార్డు గ్రహీతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎం. విజయమోహనరావు, బి.శ్రీను నాయక్, జేఆర్‌వీ తెర్మండ్, వై.ఉమాదేవి, జి.దుర్గాభవానీ, టి.వాణి, ఎ.లక్ష్మీదేవి, పి.మాధవి, టి.లీలాంజని, కె.శేషుకుమారి, ఎం.సుందరరాజు, కె.కృష్ణ కిషోర్, ఎన్.శ్రీనివాసరావు, ఎస్.భారతి, టి.శ్రీదేవిలకు నేషనల్ బిల్డర్ అవార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, ఎ.రత్నప్రభాకర్, ఎన్.నాగేశ్వరరావు, వై.వేణుగోపాల్, రోటరీ క్లబ్ కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, త్రిపురమల్లు సతీష్ బాబు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు అందె మురళి, ఆర్ ధనలక్ష్మి, కె.సుందరయ్య, వి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఎస్.రంగనాథ్, సభ్యులు కేవీఎస్ ప్రకాష్, ఆర్.శ్రీనివాసరావు, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.



నేషనల్ బిల్డర్ అవార్డులు అందుకున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో రోటరీక్లబ్ ప్రతినిధులు

చిట్యాల ఐలమ్మ, రామకృష్ణకు ఘన నివాళి

తాడేపల్లిరూరల్: బానిసత్వ విముక్తి కొరకు పోరాడిన వీర వనిత చిట్యాల ఐలమ్మ, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజం నిరంకుశ బానిసత్వ పాలనకు వ్యతిరేకంగా, పీడిత ప్రజలకు భూమి కోసం, భుక్తి కొరకు, బానిసత్వ విముక్తి కొరకు సాగిన ఆనాటి పోరాటంలో వీర వనిత చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం ఫలితంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో పదివేల ఎకరాలు పేదలకు పంచడానికి దోహదపడిందని అన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుంటామని చెప్పారు. 2000లో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా హైదరాబాద్ బషీరాబాగ్ వద్ద చోటుచేసుకున్న కాల్పుల్లో పోలీస్ తూటాలకు అమరుడైన ఆనాటి సంఘం రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ యుక్త వయసులో చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని, వారు చూపిన పోరాట మార్గంలో మనమంతా పునరంకితమై పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో బొజ్జ సుబ్బారావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు మారుతోట సుబ్బారావు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీ దారుల సంఘం నాయకులు మండూరి బాబూరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఈమని రామారావు, కొత్తపల్లి వీరాంజనేయులు, తాడేపల్లి సాంబశివరావు, సిహెచ్ కోటేశ్వరరావు, కొత్తపల్లి శ్యామ్ ప్రసాద్, అద్దంకి వీరాంజనేయులు, కొడాలి శ్రీనివాస్, నరసింహరావు, మాణిక్యాలు, శివలీల, బాలమ్మ, శకుంతల పాల్గొన్నారు.



ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

'కాళికా ప్రభాకర్' మృతి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు గోనుగుంట్ల ప్రభాకర్ (67)ఆదివారం ఉదయం సాలిపేట భిక్షావతి బజారులోని నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాళికా వేషంలో ప్రసిద్ధుడైన ప్రభాకర్, పలు రాష్ట్రాల్లో తన అభినయంతో అభినవ కాళిక అన్న బిరుదును పొందారు. శుభకార్యాలు, దేవతా ఊరేగింపుల్లో నడిచి వెళుతుండే కాళిక వేషాన్ని ప్రభాకర్ ఒక మలుపు తిప్పారు. నృత్యంతో కొత్త పుంతలు తొక్కించారు. బీజాక్షరాలు నేర్చుకుని తానే నృత్యాభినయానానికి రూపకల్పన చేశారు. ప్రేక్షకులు ఆదరించటంతో ఇక వెనుదిరిగి చూసుకోలేదు. మూడు దశాబ్దాలు కాళికా వేషధారణలో భక్తులను ఆనందింపజేశారు. వయసు మీదపడటంతో గత కొన్నేళ్లుగా విశ్రాంత జీవనం చేస్తున్నారు.

ప్రజాస్వామ్యానికి అవినీతి చీడ చంద్రబాబు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



తాడికొండ: ప్రజాస్వామ్యానికి అవినీతి చీడ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగ యువత డబ్బును దోచుకుని బాబు అడ్డంగా దొరికిపోయినట్లు చెప్పారు. '40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశాను.. నన్ను ఎవ్వరూ ఏం పీకలేరని ప్రగల్భాలు పలికిన బాబు స్టేలతో ఎందుకు పబ్బం గడిపారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహనీయుడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న చంద్రబాబు ఆయన ఆశయాలకు తూట్లు పొడిచి పార్టీని అవినీతిమయంగా మార్చినట్లు చెప్పారు. కుల, మతాలను రెచ్చగొట్టి రాష్ట్రంలో పేదలను అణగదొక్కి తన సామాజిక వర్గానికి పెద్దపీట వేశాడన్నారు. చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మరని, ఆయన రాజకీయాలకు ఇక సుదీర్ఘంగా చెక్ పడినట్లే అన్నారు. బాబును బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేసి కేసులను తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాబును లోపల ఉంచి ఆయనపై ఉన్న అన్ని కేసులలో స్టేలు తొలగించి పూర్తిస్థాయి విచారణ చేయాలని కోరారు.

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ

మంగళగిరి: నగరంలోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పండుటాకులకు మెండైన సేవ చేస్తేనే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని చెప్పారు. వయోవృద్ధుల ఆశ్రమం ఒక వసుధైక కుటుంబమని, పెద్ద వయస్సు వారి అవసరాలు చూస్తూ, అనారోగ్య సమస్యలను పట్టించుకుంటూ ఎలాంటి ఇబ్బంది లేకుండా వృద్ధాప్యంలో ఉన్న వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. వృద్ధాశ్రమం అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు, ఆకురాతి శంకరరావు, దీపాల సాంబశివరావు, పుట్టా ఏడుకొండలు, చెన్నగిరి మంజులాదేవి, ఈమని కామేశ్వరి పాల్గొన్నారు.



వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

ఆర్టీసీ ప్రయాణికుల ఇక్కట్లు

తాడికొండ: గుంతల రోడ్లపై ఆర్టీసీ అవస్థలు తప్పడం లేదు, తుళ్లూరు మండల కేంద్రం నుంచి దొండపాడు వెళ్లే ప్రధాన రహదారిపై టిడ్కో గృహాల సమీపంలో భారీ గుంత ఏర్పడింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయకపోవడంతో ఆదివారం ఏకంగా ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డుకు కనీస మరమ్మతులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



తుళ్లూరు- దొండపాడు మధ్య భారీ గుంతలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

కేబుల్ వైర్లు దగ్ధం



తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ నాలుగురోడ్ల కూడలిలోని స్క్యూబిడ్జి వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న వివిధ నెట్‌వర్క్‌లకు సంబంధించిన కేబుల్ వైర్లు దగ్ధమయ్యాయి. స్థానికులు నులకపేట విద్యుత్ శాఖ ఏఈ షణ్ముఖకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వైర్లు రెండు లేయర్లు లేచిపోవడం గమనించి వాటిని మార్చారు. గత వారం రోజుల్లో ఇలా రెండో సారి జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ వైర్లతో ఆందోళన చెందుతున్నారు.

చెత్త తొలగించరూ...



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులోని చప్టా వద్ద చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీంతో ఆప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు చెబుతున్నారు. ఏ కొద్దిపాటి వర్షం పడినా వ్యర్థాలతో తూముల్లో నీటి పారుదల సక్రమంగా లేక చప్టామీదకు నీరు చేరుతుండటంతో నడిచేందుకు వీలులేకుండా పోతుందని చెబుతుని పేర్కొన్నారు. చప్టాకు ఇరువైపులా నివాస గృహాలు ఉండటంతో చప్టాపై నీటి రాకతో గ్రామంలోకి వచ్చేందుకు వీలులేని పరిస్థితి నెలకొంటుందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి చెత్త, వ్యర్థ పదార్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మెల్‌మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్‌కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే రైల్లు, పలు వాహనాల ద్వారా వచ్చిన భక్తులు బాల ఏసుదేవాలయం వద్ద నిర్వహించిన దివ్య పూజా బలిలో పాల్గొన్నారు. అనంతరం కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాత వద్ద కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.


మంగళగిరిలో 144 సెక్షన్ విధింపు

మంగళగిరి: మండలంలో 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కోర్టు చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమలు చేయాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. అందులో భాగంగా మంగళగిరి మండలంలో ఈనెల 12వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.
నగరంలో అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

తుళ్లూరులో..

తాడికొండ: తుళ్లూరు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ ఆనందరావు ఆదివారం తెలిపారు. 4 కంటే ఎక్కువ మంది గుమికూడటం, ర్యాలీలు, సభలు, నిరసనలు చేయడం చట్ట విరుద్ధం కనుక ప్రజలు సహకరించాలని కోరారు.





రాజంపేట పార్లమెంట్ సభ్యులు
మా పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి అన్నకు
జన్మదిన శుభాకాంక్షలు
తిప్పరమల్లి అశోక్ యాదవ్